## బోనస్ సరే.. భవిష్యత్తు పెట్టుబడుల లెక్కలేంటి..?

-గుర్తింపు సంఘం అసంతృప్తి -దసరా తర్వాత చర్చిస్తారట



2 లో

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

మంగళవారం | 23 | సెప్టెంబర్ | 2025 పేజీలు : 8

# అమానవీయంపై మౌనమెందుకు..?

## కాసుల కోసం ఇంతకు దిగజారాలా..



ప్రజాపక్షం/ఖమ్మం : మైనర్ బాలిక గర్భం దాల్చటం అమానవీయం. అటువంటిది ఆ బాలికకు పురుడు పోసి ప్రాణం పోసుకున్న శిశువును అమ్మకానికి పెట్టారంటే కాసుల కోసం ఎంతకు దిగజారారో అవగతం అవుతుంది. ఇంతటి అమానవీయ ఘటనపై అధికార యంత్రాంగం మౌనం ఎందుకు వహిస్తుందో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. కొందరి తీరుతో మొత్తం వైద్య వ్యవస్థ

మిగతా 2లో..

# మణుగూరు ఓసి విస్తరణలో మాయాజాలం..!



-చక్రం తిప్పుతున్న దళారులు

-అసలైన భూ నిర్వాసితులకు న్యాయం జరిగేనా..?

ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరులో సింగరేణి సంస్థ ఓసీ విస్తరణకు చేపట్టిన భూసేకరణలో దళారులు చక్రం తిప్పుతున్నారు. ఇందుకు అధికారులు ఎంజాయ్ మెంట్ సర్వే నిర్వహిస్తుండగా, దళారులు కొడుకులు ఉన్న వారిని టార్గెట్‌గా చేస్తున్నారు. బాండ్ పేపర్లను భద్రాచలం ఏరియా నుంచి 2014వ సంవత్సరానికి ముందు ఉన్న పాత బాండ్లను తెప్పించి, వాటిని రూ.15 వేలకు విక్రయిస్తున్నారు. పాత బాండ్ల సాయంతో అనుభవదారులుగా పేర్లు ఎక్కించుకునే విషయంలో రెవెన్యూ అధికారుల అండ ఉందనే ఆరోపణలు వస్తున్నాయి. మధ్యవర్తికి లక్ష రూపాయలు, మిగతాది నకిలీ బాండ్లతో పేర్లు ఎక్కించుకున్న వారికి చెందేలా చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఓ వైపు బాండ్లను తీసుకు వచ్చిన వారి పేర్లు చేర్చడం, మరోవైపు అధికారులు ఎంజాయ్ మెంట్ సర్వే పరిగణలోకి తీసుకుంటే సింగరేణి సంస్థకు భారీగా నష్టం జరిగే

మిగతా 2లో..

# లాభసాటి పంటలపై దృష్టిసారించండి




-10వేల ఎకరాల్లో పామాయిల్ సాగు

-గుడిసెల్లో ఉండే నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు

-లచ్చిరాంతండాలో అభివృద్ధి పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన

ప్రజాపక్షం/రఘునాథపాలెం : లాభసాటి పంటలైన ఆయిల్‌పామ్ సాగు దిశగా రైతులు దృష్టిసారించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రఘునాథపాలెం మండలం లచ్చిరాంతండా గ్రామంలో సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించారు. రూ. 2.15 కోట్లతో లచ్చిరాంతండా నుంచి ఈర్లపుడి వరకు బిటి రోడ్డు నిర్మాణ పనులకు, రూ. 80లక్షలతో లచ్చిరాంతండా నుండి దొనబండ మధ్య వంతెన నిర్మాణ పనులకు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ

మిగతా 2లో..

# ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యం



-డిప్యూటి సిఎం భట్టి

-ముదిగొండ మండలంలో

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాపక్షం/ ఖమ్మం : ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని డిప్యూటి సిఎం మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. సోమవారం ముదిగొండ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసి మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు చోట్ల జరిగిన సభల్లో విక్రమార్క మాట్లాడుతూ మధిర నియోజక వర్గ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేస్తున్నామని ఇందుకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ

మిగతా 2లో..

# అమానవీయంపై మౌనమెందుకు..?

(మొదటిపేజీ తరువాయి)



అబాసుపాలవుతుంది. శిశువు విక్రయం కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించి రెండు కారణాల్లో అధికార యంత్రాంగం దర్యాప్తు చేయాల్సి ఉంది. శిశువు విక్రయానికి సంబంధించి అసలు ఆ ప్రయత్నం జరిగిందా లేదా జరిగితే ఏమి చర్యలు తీసుకున్నారు. జరగకుండానే మీడియాలో వార్తలొస్తే ఖండించాల్సిన అధికార యంత్రాంగం ఎందుకు ఖండించడం లేదు. మైనర్ బాలిక గర్భం దాల్చడం అనేది మహబూబాబాద్ జిల్లాకు చెందినప్పటికీ ఖమ్మం ఆసుపత్రిలో పురుడు పోశారన్న విషయం బయటకు పొక్కిన తర్వాత అటు పోలీసులు, ఇటు వైద్య ఆరోగ్య శాఖాధికారులు, శిశు సంక్షేమ శాఖాధికారులు ఎందుకు స్పందించడం లేదన్న దానిపై ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. మైనర్ బాలికకు సంబంధించి ముందస్తు సమాచారం లేకుండా ఇటువంటి వైద్యం ఎందుకు నిర్వహించారన్న దానిపై అధికార యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ ఇదంతా మసిబూసి మారెడుకాయ చేసే ప్రయత్నం జరుగుతుంది. ప్రతి సారి ఏదైనా ఘటన వెలుగు చూసినప్పుడు ఒకట్రెండు రోజులు హడావుడి చేయడం తర్వాత వదిలివేయడం ఒక అలవాటుగా మారింది. ఇప్పటికే ఖమ్మం ఆసుపత్రులకు సంబంధించి తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాసుల కోసం కొందరు కక్కుర్తి పడుతున్నారని అది మొత్తం వైద్య రంగానికే మచ్చ తీసుకు వస్తుందని కొందరు వైద్యులే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖ ప్రైవేటు ఆసుపత్రుల పట్ల చూసి చూడనట్లుగా వ్యవహరిస్తుంది. రాష్ట్రంలోనే ఒక మెడికల్ హబ్‌గా తయారైన ఖమ్మం ఉమ్మడిజిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని నల్లగొండ, వరంగల్ ఉమ్మడి జిల్లాలు ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి , పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి కూడా వైద్యం కోసం వస్తున్నారు. ఇటువంటి సందర్భంలో ఖమ్మం వైద్య రంగం పట్ల మరింత విశ్వసనీయత పెరిగేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఒకట్రెండు ఘటనలు పలుమార్లు చర్చనీయాంశలవుతున్నాయి. అమానవీయ ఘటనల పట్ల అధికార యంత్రాంగం ప్రజలకు వాస్తవాలను తెలపాల్సి ఉంది. అనవసరమైన చర్చకు తావిచ్చి మొత్తం వైద్య రంగాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేయవద్దని కోరుతున్నారు.

# మణుగూరు ఓసి విస్తరణలో మాయాజాలం..!

(మొదటిపేజీ తరువాయి)

అవకాశం ఉంది.

**దళారులకు వరంగా మారిన భూసేకరణ ప్రక్రియ...**

మణుగూరులో సింగరేణి సంస్థ ఓసీ విస్తరణకు చేపడుతున్న భూసేకరణ ప్రక్రియ దళారులకు వరంగా మారింది. అమాయకులను తప్పుదోవ పట్టిస్తూ అక్రమాలకు తెరలేపుతున్నారు. భూమితో ఎలాంటి సంబంధం లేని వ్యక్తులను తీసుకువచ్చి భూ యజమానితో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. కొడుకులు ఉన్న వారిని టార్గెట్‌గా చేసి వారికి మాయ మాటలు చెప్పి వారి పేర్లను నిర్వాసితుల లిస్టులో చేర్చుతున్నారు. ఇందులో 18ఏండ్లు నిండిన వారికి ఇచ్చే నగదులో వాటాలు వేసుకుంటున్నారు. ఈ విధంగా సింగరేణి భూసేకరణలో దళారులు చక్రం తిప్పుతున్నారు. ఈ దళారుల్లో కొందరు అధికార పార్టీ నాయకులు, మాజీ రెవెన్యూ ఉద్యోగులు, రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న కొందరు ముఖ్య సిబ్బంది ఉన్నారు. దళారులతో చేతులు కలిపి 2014కంటే ముందు నుంచి శిస్తులు ఉన్నట్టు సృష్టిస్తున్నారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కోసం అనర్హుల పేర్లు జాబితాలో చేర్చేందుకు శతవిధాలుగా ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. బాండ్ పేపర్లను భద్రాచలం ఏరియా నుంచి కొందరు భారీ సంఖ్యలో మణుగూరుకు తెప్పించి మరి దందాకు పాల్పడుతున్నారు. అధికారులు మాత్రం ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహిస్తూ నకిలీ బాండ్లతో సర్వే దగ్గరకు వచ్చిన వారి పేర్లను నమోదు చేసుకుంటున్నారు.

**భూ యజమానులతో దళారుల చర్చలు...**

ఓసి విస్తరణలో భూముల కోల్పోతున్న భూ యజమానులతో దళారులు చర్చలకు తెరలేపారు. 2014వ సంవత్సరానికి ముందు ఉన్న పాత బాండ్లను తెప్పించే వాటిని రూ.15 వేలకు విక్రయిస్తున్నారు. మధ్యవర్తికి లక్ష రూపాయలు, మిగతా మూడున్నర లక్షలు నకిలీ బాండ్లతో పేర్లు ఎక్కించుకున్న వారికి చెందేలా చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నారు.

**కీలక రికార్డులు మాయం...?**

మణుగూరు తహశీల్దార్ కార్యాలయంలో అతి కీలకమైన భూ రికార్డులు మాయం అయ్యాయనే వార్తలు గతంలో చెక్కర్లు కొట్టాయి. అది అబద్ధం కాదని భూ సేకరణ విషయంలో నకిలీ బాండ్ల పేరుతో భూమితో ఎటువంటి సంబంధం లేని వ్యక్తుల పేర్లు చేర్చి వారికి శిస్తులు కూడా ఇస్తుండటన్ని చూస్తే రికార్డులు మాయం అయినట్టుగానే అనిపిస్తోంది. రికార్డులు లేకపోవడంతోనే దళారులు ఆడిందే ఆట పాడిందే పాటగా కొనసాగుతోంది.

**అంతా అధికారుల కనుసన్నల్లోనే...**

మణుగూరు ఓసీ విస్తరణలో భాగంగా పాత బాండ్లను తీసుకు వచ్చి అనుభవ దారులుగా పేర్లు ఎక్కించుకునే విషయంలో రెవెన్యూ అధికారుల అండ దండలు పుష్కలంగా ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రెవెన్యూ కార్యాలయంలో విధులు నిర్వహించే ముఖ్యమైన సిబ్బంది దళారులకు వత్తాసు పలుకుతూ దందాకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి. రెవెన్యూ హస్తం లేనిదే పేర్లు లిసుల్లో ఎలా ఎక్కుతున్నాయని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**సింగరేణి సంస్థకు పెద్దఎత్తున నష్టం...**

ఓసీ విస్తరణలో నకిలీ బాండ్లను తీసుకు వచ్చిన వారి పేర్లను చేర్చుతున్నారు. ఇలా చేయడంతో వారికి అందరికీ సింగరేణి సంస్థ ప్యాకేజీని చెల్లించాల్సి వస్తుంది. ఎంజాయ్ మెంట్ సర్వేనే పరిగణలోకి తీసుకుంటే మాత్రం సింగరేణి సంస్థకు భారీగా నష్టం జరుగుతుంది. ఏకంగా కోట్ల రూపాయలకు పైగా నష్టం జరుగబోతోంది.

# లాభసాటి పంటలపై దృష్టిసారించండి

(మొదటిపేజీ తరువాయి)



గ్రామాల్లో అవసరమైన అభివృద్ధి పనులు ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నట్లు తెలిపారు. రైతులు పామాయిల్, వక్క, కొబ్బరి వంటి పంటలు సాగు చేసుకోవాలని వీటిలో మిర్చి, పత్తి, కూరగాయలు వంటి అంతర పంటలు కూడా వేసుకోవచ్చునన్నారు.పామాయిల్ సాగు చేస్తే ఎకరానికి రూ. 51వేలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. మొక్కలకు, అంతర పంటలకు డ్రిప్ ఏర్పాటుకు సబ్సిడీ అందిస్తామన్నారు. పామాయిల్ సాగు చేస్తే ఎకరానికి రెండు లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందన్నారు. వేసవిలో కూడా మండలంలో సాగునీటి ఇబ్బందులు లేకుండా చెరువులు నింపేలా తగు చర్యలు తీసుకున్నామన్నారు. లాభసాటి పంటల వైపు రైతులు దృష్టిసారించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో గుడిసెల్లో ఉంటున్న నిరుపేదలకు మొదటి విడతలో ఇండ్లు ఇచ్చామన్నారు. అర్హులైన వారికి రెండవ విడతలో, మూడవ విడతలో ఇండ్లు అందిస్తామని ఎవరు ఆందోళన చెందవద్దన్నారు. గ్రామాల్లో విద్యుత్ లైన్ల షిఫ్టింగ్‌కు అవకాశాలు పరిశీలించాలని విద్యుత్ శాఖాధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో మట్టికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటూ ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు పొందిన వారిని ఫారెస్ట్ అధికారులు ఇబ్బందులు పెట్టవద్దన్నారు. గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు పొలాలకు వెళ్లే డొంక రహదారులను అభివృద్ధి పరుస్తామన్నారు. రఘునాథపాలెం మండలంలో ఆయిల్ పాం సాగుపై రైతులు దృష్టిసారించాలన్నారు. ఈ ఏడాది మండలంలో 10వేల ఎకరాల్లో ఆయిల్ పాం సాగు చేసేలా వ్యవసాయ అధికారులు రైతులను ప్రోత్సహించాలన్నారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పామాయిల్ సాగులో ఖమ్మంజిల్లాను ముందంజలో ఉంచేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్గదర్శకాలను రైతులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. మారుమూల ప్రాంతాల్లో సైతం అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, ఆత్మ ఛైర్మన్ దిరిశాల వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, పిఆర్ఈఈ మహేష్‌బాబు, విద్యుత్ శాఖ డిఈ రామారావు, తహసీల్దార్ శ్వేత, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సాధు రమేష్‌రెడ్డి, మండల కాంగ్రెస్ కన్వీనర్ దీప్లా నాయక్, నాయకులు కృష్ణప్రసాద్, బాబు, నవీన్, రాము, దేవ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

రూపొందించుకుని అమలు చేస్తున్నామన్నారు. నియోజక వర్గ అవసరాలు గుర్తించి త్వరితగతిన వాటిని పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన ద్వారా జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని మహిళలకు ఉచిత ఆర్టీసి బస్సు ప్రయాణం, గ్యాస్ సిలెండర్, ఉచిత విద్యుత్, సన్నబియ్యం, రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్ వంటి కార్యక్రమాలను ఇప్పటికే అమలు చేస్తున్నామని మరికొన్ని కార్యక్రమాలను త్వరలోనే అమలు చేస్తామన్నారు. పిల్లల భవిష్యత్తుకు సంబంధించి ప్రభుత్వం ఆలోచించి మెరుగైన విద్య, ఆహారాన్ని అందించేందుకు డైట్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచడం జరిగిందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా స్కూళ్లను ప్రారంభిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా యడవల్లిలో పంచాయతీ భవనానికి రూ. 68 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్లకు, మాధాపురం లో రూ. 68 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. అంగన్‌వాడీ భవన నిర్మాణానికి ముదిగొండలో రూ.59.50 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆర్అండ్‌బి ఎస్ఈ యాకోబ్, పిఆర్ ఎస్ఈ వెంకటరెడ్డి, భగీరథ ఇఇ వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# బోనస్ సరే.. భవిష్యత్తు పెట్టుబడుల లెక్కలేంటి..?

**ప్రజాపక్షం/ ఖమ్మం :** సింగరేణి కార్మికులకు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ బోనస్‌లు ప్రకటించడంపై ఒక పక్క సానుకూలత వ్యక్తమవుతున్నా భవిష్యత్తు పెట్టుబడుల పేరుతో కేటాయించిన నిధులకు లెక్కలేమిటన్న ప్రశ్న తలెత్తుతుంది. ఈ ఏడాది సింగరేణి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 819 కోట్ల మొత్తాన్ని బోనస్‌గా ప్రకటించింది. లాభల్లో 34 శాతాన్ని బోనస్‌గా ప్రకటించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. కానీ సింగరేణి భవిష్యత్తు పెట్టుబడుల కోసం పక్కనపెట్టిన నిధుల సంగతేమిటన్ని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రశ్నించింది. ఈ మేరకు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. గతేడాది అభివృద్ధి పనులు, భవిష్యత్తు పెట్టుబడుల పేరుతో రూ. 2289 కోట్లు పక్కనపెట్టారని వాటిని దేనికి ఖర్చు చేశారని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య ప్రశ్నించారు. పాత లెక్కలు చెప్పకుండానే ఈ ఏడాది మరో రూ.4034 కోట్లు దేనికి ఖర్చు పెడతారో వివరాలు చెప్పాల్సిన అవసరం సింగరేణి యాజమాన్యంపై ఉందన్నారు. గుర్తింపు సంఘంతో నిధుల వ్యయం తదితర విషయాలపై చర్చించకుండా ఉండటాన్ని గుర్తింపు సంఘం నిరసిస్తుందని సీతారామయ్య తెలిపారు. ఈ నెల 19న సింగరేణి వ్యాప్తంగా బోనస్ ప్రకటన కోసం యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేయడం జరిగిందని ఆయన తెలిపారు. కార్మికుల్లో ఉన్న వ్యతిరేకతను గ్రహించి చర్చించడానికి సానుకూల ఏర్పడడంతో ఈ నెల 20న ముఖ్యమంత్రిని కలవడం జరిగిందన్నారు. సింగరేణిలో నెలకొన్న కార్పోరేట్ మెడికల్ బోర్డు, సొంతింటి పథకం, సింగరేణికి నూతన ప్రాజెక్టులు, మారుపేర్ల సమస్య, పన్ను చెల్లింపు తదితర విషయాలపై ముఖ్యమంత్రితో చర్చించడం జరిగిందని సీతారామయ్య తెలిపారు. ఉప ముఖ్యమంత్రి సిఎండితో చర్చించాలని ముఖ్యమంత్రి సూచించారని కానీ చర్చించకుండానే సోమవారం ఏకపక్షంగా రూ.4034 కోట్లను ఫ్యూచర్ ప్రాజెక్టుల కోసం కేటాయిస్తున్నామని రూ.2360 కోట్లు మాత్రమే గత ఆర్థిక సంవత్సరానికి లాభాలు వచ్చాయని ప్రకటించడం అందులో 34 శాతం వాటాను ఇస్తామనడం సరికాదన్నారు. గతేడాది తీసిన దానికి లెక్కలు చెబితే బాగుండేదని ఈ విషయమై సిఎండి ముందు నిరసన తెలియజేశామన్నారు. కార్మికుల సమస్యలపై దసరా తర్వాత చర్చించేందుకు అంగీకరించారని ఆయన తెలిపారు. సమావేశంలో యూనియన్ నాయకులు మిరియాల రంగయ్య, కె. సారయ్య, కె. వీరభద్రయ్య, వైవిరావు, ప్రకాష్, అక్బల్‌అలీ,వంగా వెంకట్, రాంగోపాల్, కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుర్రా తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## - అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం : డీఎస్పీ రెహమాన్




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సైబర్ నేరాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపనున్నట్లు డిఎస్పి రెహమాన్ అన్నారు. సోమవారం లక్ష్మీ దేవిపల్లి మండల పరిధిలోని ఎదురుగడ్డ గ్రామంలో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఇందులో భాగంగా సుమారు 250 ఇళ్లలో సోదాలు నిర్వహించి, సరిగా పత్రాలు, నెంబర్ ప్లేట్లు లేని 100 ద్విచక్ర వాహనాలు, 08 ఆటోలను సీజ్ చేశారు. సుమారు రూ.20వేల విలువగల మద్యం సీసాలను స్వాదీనం చేసుకుని ఐదుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డిఎస్పి మాట్లాడుతూ చట్ట వ్యతిరేక, సంఘవిద్రోహ, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. తమ ప్రాంతాల్లో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. అసాంఘిక శక్తులపై ఇప్పటికే నిఘా ఏర్పాటు చేశామని, సమాచారం అందించే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని, ఇబ్బంది కర పరిస్థితులు తారసపడినప్పుడు 100కు డైయిల్ చేసి పోలీసుల సేవలు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం 2టౌన్ సిఐ ప్రతాప్, చుంచుపల్లి సిఐ వెంకటేశ్వర్లు, 1టౌన్ సిఐ కరుణాకర్, 3టౌన్ సిఐ శివప్రసాద్,ఎస్సైలు రమణారెడ్డి, బదావత్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

# దరఖాస్తులు పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలి



-కారుణ్య నియామకాల కోసం ఖాళీల జాబితాను అందించాలి
-ప్రజావాణిలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను జిల్లా అధికారులు తమ వద్ద పెండింగ్ లేకుండా చూడాలన్నారు. కారుణ్య నియామకాలు చేపట్టేందుకు జిల్లా కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్, కార్యాలయాల సబార్డినేట్ ఖాళీ పోస్టుల వివరాలను వారం రోజుల్లో అందించాలన్నారు. యూడైస్ పోర్టల్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ ) ప్రకారం విద్యుత్, త్రాగునీరు, మరుగుదొడ్లు లేని పాఠశాలలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదిక అందించాలన్నారు. జిల్లా అధికారులు తప్పనిసరిగా సంక్షేమ వసతి గృహాల తనిఖీ ప్రతి వారం నిర్వహించి భోజన నాణ్యతను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. ఖమ్మం నగరం పాకబండ బజార్‌కు చెందిన ఎం.హరి శ్రావణ్‌కుమార్ తనకు రేషన్ దుకాణ డీలర్‌షిప్ ఇప్పించి జీవనోపాధి కల్పించాలని దరఖాస్తు చేశారు. కూసుమంచి మండలం నర్సింహులగూడెం గ్రామానికి చెందిన రత్నకుమారి, పుష్ప, భద్రమ్మ తమకు సర్వేనెం. 1123లో భూ పంపిణీ పథకం క్రింద కేటాయించిన భూమికి ఇతరులు దారి కబ్జా చేశారని దారి ఇప్పించాలని దరఖాస్తు చేశారు. చింతకాని మండలం లచ్చగూడెంకు చెందిన రైతులు తాము పండించిన పెసర పంటను మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని దరఖాస్తు చేశారు. దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని వినతి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** గామ పంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కలెక్టరేట్‌లో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న సిబ్బందికి పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. 2020 కరోనా సమయంలో పంచాయతీ సిబ్బందికి రెండు దఫాలుగా ఐదువేల చొప్పన రూ. 10వేలు ఇవ్వడం జరిగిందని జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీలకు ఒకరిద్దరికి మినహా రూ. 10వేలు ఇవ్వడం జరిగిందన్నారు. మిగిలిన వారికి కూడా రూ. 10వేలు ఇవ్వాలని పలు మార్లు డిపివో, కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. కానీ ఇంత వరకు వాటికి సంబంధించి ఎటువంటి సమాచారం కూడా లేదన్నారు. వెంటనే మూడు నెలల పెండింగ్ వేతనాలతో పాటు రూ. 10వేలను అందించాలన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి గ్రీన్ ఛానెల్ ద్వారా ప్రతి నెల ఒకటిన వేతనాలు చెల్లిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం జరిగిందని కానీ ఇంత వరకు గ్రీన్ ఛానెల్ ద్వారా వేతనాలు చెల్లించడం లేదన్నారు. మూడు నెలల నుంచి జీతాలు రాక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని దసరా పండుగకు సిబ్బంది పస్తులు ఉండే ప్రమాదం నెలకొందన్నారు. ఈనెల 25లోపు వేతనాలు చెల్లించాలని లేని పక్షంలో విధులు బహిష్కరిస్తామన్నారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ అందుబాటులో లేక పోవడంతో డిఆర్‌వోకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మీ నారాయణ, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల మల్లయ్య, రఘునాథపాలెం మండల అధ్యక్ష,కార్యదర్శులు రాజ్‌గోపాల్, మంగీలాల్, వివిధ మండలాలకు చెందిన పంచాయతీ సిబ్బంది రేణుక, లింగయ్య, రాము, విజయరాజు, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, వీరన్న, రామకృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

# విధులను బహిష్కరించిన మిషన్ భగీరథ కార్మికులు



**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం జిల్లా మిషన్ భగీరథ కార్మిక సమస్యలపై కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించాలని విధులు బహిష్కరించి నిరసన తెలియజేశారు. అందులో భాగంగా మిషన్ భగీరథ సిఈ శ్రీనివాస రావు, ఎస్సీ విజయభాస్కర్‌రెడ్డి, ఎల్అండ్‌టి మేనేజర్ టివిఎల్‌కె రెడ్డి, మిషన్ భగీరథ జేఏసి నాయకులతో చర్చలు జరిపి ఆగస్ట్28నాడు ఒక నెల జీతం ఇస్తామని, సెప్టెంబర్7 నాడు రెండు నెలల జీతం ఇస్తానని మీడియా సమక్షంగా హామీ ఇవ్వడం జరిగింది. హామీ నేటికి అమలు చేయకపోవడం పెండింగ్ జీతాలు చెల్లించాలని అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కాని అమలు కాలేదు. విధి లేని పరిస్థితిలో విధులు బహిష్కరించి నిరసనతెలియజేస్తామని మిషన్ భగీరథ కార్మికులు తెలిపారు. ఖమ్మం జిల్లా సబ్ కలెక్టర్ దగ్గర జరిగిన సమావేశంలో ఒక నెల జీతం ఇస్తామని తెలియజేశారు. కార్మిక సంఘం నాయకులు రెండు నెలల జీతం ఇప్పించండి దసరా పండుగ ఉందని వేడుకున్నా గాని అధికారులు పట్టించుకోలేదు. కావున తప్పని పరిస్థితిలో విధులు బంద్ చేసి ఖమ్మం జిల్లావ్యాప్తంగా మిషన్ భగీరథ మంచినీటిని నిలుపుదల చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తిరుమలచారి, సిపిఎం పార్టీ మండల నాయకులు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొంతు రాంబాబు, చింతనిప్పు చలపతి, పురుషోత్తం, అమరనేని కృష్ణ, బిఆర్ఎస్ పార్టీ వైరా మండల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, పట్టణ నాయకులు ఏదునూరి శ్రీను, కార్మిక సంఘం నాయకులకు సంఘీభావంగా తెలియజేశారు. భవిష్యత్ కార్యచరణలో మా వంతు సహాయ సహకారాలు మీకు అందిస్తామని తెలియజేశారు. మిషన్ భగీరథ ఖమ్మం జేఏసి నాయకులు సిఐటియు పావ కంటి రాంబాబు, అన్నం వెంకయ్య, ఐఎన్‌టియుసి వేల్పుల అనంత రావు, అనుబోతు బాలకృష్ణ, బిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు మద్దెల రవి, బత్తుల కిషోర్, యాకువలి శ్రీనివాసరావు, పర్సా రవి పాల్గొన్నారు.

# రూ.100కోట్ల నిధులు వెంటనే విడుదల చేయాలి



**ప్రజాపక్షం/వైరా:** సిపిఎం వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వైరా మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని సిపిఐ(ఎం) వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ ఆలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం వైరా మున్సిపాలిటీ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ.. వైరా మున్సిపాలిటీ అభివృద్ధికి కేటాయించిన రూ.100కోట్లు నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, అధికారులు వెంటనే స్పందించి వైరా మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ప్రజలను సమీకరించి పోరాటాలు ఉధృతం చేస్తామని సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, కొణిజర్ల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, డివిజన్ కమిటీ సభ్యులు మచ్చా మణి, తోట నాగేశ్వరరావు, తూము సుధాకర్, గుడిమెట్ల మోహన్‌రావు, పైడిపల్లి సాంబశివరావు, రాచబంటి బత్తిరన్న, బాజోజు రమణ, అనుమోలు రామారావు, కామినేని రవి, షేక్ నాగుల్‌పాషా, మల్లెంపాటి రామారావు, సంక్రాంతి పురుషోత్తంరావు, సంక్రాంతి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫొటోగ్రాఫర్స్‌కు శిక్షణా తరగతులు






**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మంజిల్లా ఫోటో గ్రాఫర్స్‌కు వివిధ అంశాలపై శిక్షణా తరగతులు నిర్వహించారు. సోమవారం తమిళనాడుకు చెందిన ప్రముఖ మోడలింగ్ ఫోటోగ్రాఫర్ ప్రసన్న వెంకటేష్ వెడ్డింగ్ ఫోటోగ్రఫీ, లైట్ మేనేజ్‌మెంట్, మోడ్రన్ ఫోటోగ్రఫీ వంటి అంశాల మీద ఫోటోగ్రాఫర్స్‌కు ఆర్‌కె బృందం ఆధ్వర్యంలో శిక్షణ అందించారు. గతంలో ఎన్నడులేనివిధంగా ఫోటోగ్రాఫర్స్‌కు లైట్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించడం పట్ల సీనియర్ ఫోటోగ్రాఫర్స్ హర్షం వ్యక్తం చేశారు. ఈ శిక్షణా తరగతులను ఫోటోగ్రాఫర్స్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఫోటోగ్రఫీ రంగంలో కూడా వస్తున్న మార్పులను ఫోటోగ్రాఫర్స్ అందిపుచ్చుకోవాలని ప్రసన్న వెంకటేష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్‌కె బృందం సీనియర్ ఫోటోగ్రాఫర్స్ సిఎన్‌సి శ్రీనివాస్, నాగరాజు దేవర, నీరుడు తిరుపతిరావు, కమటం రఘు, లాస్య అంజి, చింతల ఫణీందర్, ముదుసు రంజిత్, కేస్ బాబా, ఐ మార్క్ జగన్, సతీష్‌రెడ్డి, పవన్, మోహన్, పగడాల నాగరాజు, జిల్లాకు చెందిన పలువురు ఫోటోగ్రాఫర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఖమ్మం కార్పోరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ పంపిణీ చేశారు. సోమవారం ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని 26వ డివిజన్ సుగ్గల వారి తోటలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారసు మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు మేయర్ పునుకొల్లు నీరజ ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ది చేకూరుస్తున్నట్లు తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో ఖమ్మం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఖమ్మం నగరం పచ్చదనం, పరిశుభ్రతతో ఉండేలా ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుజ్జి, శ్రీను, ప్రసాద్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

# పిహెచ్‌సిలో సమస్యలను పరిష్కరించాలి




**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని పివైఎల్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్‌వి రాకేష్ , పివోడబ్ల్యూ జిల్లా అధ్యక్షులు గోకినపల్లి లలిత డిమాండ్ చేశారు. సోమవారం పివైఎల్, పివోడబ్ల్యూ బృందం మంచుకొండ పిహెచ్‌సిని పరిశీలించి డా॥ బాలకృష్ణతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్ రెగ్యులర్ పోస్టును వెంటనే భర్తీ చేయాలన్నారు. పిహెచ్‌సికి రోజుకు సుమారు 100 మంది వివిధ అనారోగ్య సమస్యలతో వస్తున్నారని రోగులకు అనుగుణంగా వార్డుల గదులను పెంచాలన్నారు. ఆసుపత్రి చుట్టూ ప్రహరీ గోడను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పివోడబ్ల్యూ, పివైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి పి.శోభ, జై. భరత్, ఇస్లావత్ రమేష్, ఇస్లావత్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికైన ఎస్ఎఫ్ఎస్ విద్యార్థి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎస్ఎఫ్ఎస్ పాఠశాల విద్యార్థి కె. సుశిత్ రెడ్డి ఎంపికయ్యారు. సర్దార్ పటేల్ మైదానంలో నిర్వహించిన అండర్ 6 స్కేటింగ్ పోటీల్లో ఎస్ఎఫ్ఎస్ పాఠశాలకు చెందిన ఎల్‌కెజి విద్యార్థి కె. సుశిత్ రెడ్డి అత్యంత ప్రతిభ కనబర్చి 500, 1000 మీటర్ల విభాగంలో సిల్వర్, బ్రౌంజ్ పతకాలు సాధించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు సుశిత్‌రెడ్డి ఎంపికయ్యాడు. ప్రతిభ కనబర్చిన సుశిత్‌రెడ్డిని పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ రాజారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

## చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగుల పంపిణీ

**చేతన ఫౌండేషన్ సేవలు అభినందనీయం : ఎస్సై రామారావు**



**ప్రజాపక్షం/వైరా:** వైరా పట్టణం లోని ప్రభుత్వ పాఠశాలలో చదువు తున్న విద్యార్థులకు చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన వైరా సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పుప్పాల రామారావు విద్యార్థులకు బ్యాగులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కృషి చేసి ఉన్నత విద్యను సాధించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. విద్యాభివృద్ధి కోసం పనిచేస్తున్న చేతన ఫౌండేషన్ సేవలు అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో చేతన ఫౌండేషన్ సభ్యులు ముత్తినేని సురేష్, చంద్రకాని నవీన్, షేక్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్లతో సమావేశం



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలంలోని సివిల్ సప్లై డీలర్లతో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మణిధర్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ ప్రజలందరికి అందేలా చూడాలని, షాపులు సమయపాలన పాటించాలన్నారు. ప్రతి నెల మొదటి తేదీ నుండి 15వ తేదీ వరకు ఇవ్వాలని, డీలర్లు ప్రజలతో సఖ్యతగా ఉండాలని తెలిపారు. బియ్యం నిల్వల్లో, రేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలు జరిగితే సహించేది లేదన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా రేషన్ డీలర్ల సంఘం నాయకులు కొడాలి వెంకటేశ్వర్లు, మండలంలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## అనుమతులేని ఇసుక ట్రిప్పర్లు పట్టివేత



**ప్రజాపక్షం/కల్లూరు:** ఆంధ్రప్రదేశ్ నుండి కల్లూరుకు అనుమతి లేకుండా ఇసుకలోడుతో వచ్చిన ఇసుక టిప్పర్లను సోమవారం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరిత తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుండి కల్లూరు కు ఎటువంటి అనుమతి లేకుండా అక్రమ రవాణా చేస్తున్న డ్రైవర్ స్వామి కంచికచర్ల మండలం కేసరి నుంచి, ఓనర్ కంచేటి గోపాలకృష్ణ చందర్లపాడు మండలం కొత్తపాలెం అనువారిపై సమాచారం మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇసుక, ట్రిప్పర్లను అదుపులోకి తీసుకున్నట్టు వారు పేర్కొన్నారు.

## కార్మికులకు ప్రమాద బీమా నమోదు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని మున్సిపాలిటీ కార్మికులకు సోమవారం తపాలా ప్రమాద బీమా కార్యక్రమాన్ని మున్సిపాలిటీ కమీషనర్ సంపత్ కుమార్, మేనేజర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం 93 మంది మున్సిపాలిటీ కార్మికులకు, సిబ్బందికి తపాలా బీమా 10 లక్షలు కవరేజ్ ఉండే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తపాల బీమా అధికారులు మున్సిపాలిటీ అధికారులు మాట్లాడుతూ తపాలా ప్రమాద బీమా ద్వారా జరగరాని ప్రమాదం జరిగితే కుటుంబానికి ఆర్థిక చేయూత ఉంటుందని కనుక ప్రతి వ్యక్తి ప్రమాద బీమా తప్పనిసరిగా చేయించుకోవాలని వారు కోరారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ నెలలో మున్సిపాలిటీ సిబ్బందికి ప్రమాద బీమా చేస్తున్నట్లు మేనేజర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధికారులు తపాలా శాఖ, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

## టిటిడి కళ్యాణ మండపం పునః ప్రారంభం



**ప్రజాపక్షం/కల్లూరు:** రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, జిల్లా ఆర్య వైశ్య సంఘం పసుమర్తి చందద్రావు అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజాదేవి టిటిడి కళ్యాణ మండపం ఇన్చార్జులు రాము, రుక్మిణి దేవి, కల్లూరులోని టీటీడీ కళ్యాణ మండపం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల క్రితం ఈ కళ్యాణ మండపం మరమ్మత్తులు దృశ్య శుభకార్యాలు నిలిచిపోవడంతో మరమ్మత్తులు అనంతరం సోమవారం దీనిని పునఃప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు. ప్రజలు పాల్గొన్నారు.

# రోడ్డెక్కిన ఆటో కార్మికులు

**ఆగమవుతున్న ఆటో డ్రైవర్ల జీవితాలు**
**ఆటో కార్మికులకు ప్రభుత్వం ఆర్థిక చేయుతనందించాలి**
**ఏఐటీయూసీ డిమాండ్**




**ప్రజాపక్షం/దమ్మపేట:** దమ్మపేట మండల కేంద్రంలో (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సోమవారం మండల వ్యాప్తంగా (ఏఐటీయూసీ) కి అనుబంధంగా ఉన్న ఆటో డ్రైవర్లు తమ సమస్యల పరిష్కారం కోరుతూ మండల కేంద్రంలోని నెమలిపేట నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా నిరసన చేపట్టారు. అనంతరం తహశీల్దార్ భగవాన్ రెడ్డి కి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో (ఏఐటీయూసీ) వర్కింగ్ ప్రెసిడెంట్ సీపీఐ జిల్లా నాయకులు సుంకిపాక ధర్మ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం వల్ల ఆటో కార్మికులకు మహాలక్ష్మి పథకం గొడ్డలిపెట్టుగా మారిందని వాపోయారు. గత కొన్ని రోజులుగా ఆటో డ్రైవర్లు కూడా ఉచిత బస్సు ప్రయాణంపై అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకంతో ఆటో డ్రైవర్ల ఉపాధికి గండి పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్లను ఆదుకోవడంలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ చర్యల కారణంగా రాష్ట్రంలో ఇప్పటి వరకు 93 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. బాధిత కుటుంబాలను కనీసం పరామర్శించడానికి కూడా రాని ప్రభుత్వ పెద్దలు ఆర్థికంగా నిలదొక్కుకున్న ఆర్టీసీకి అదనంగా 200 కోట్లు వచ్చాయని పండుగ చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరించకుండా మోసం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం దారుణమని పేర్కొన్నారు. పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. ఆటోలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ చెల్లించాలని, యాక్సిడెంట్ బీమాను 10 లక్షలకు పెంచాలని కోరారు. ఒక్కొక్క ఆటో డ్రైవర్ కుటుంబానికి 12 వేల ఆర్థిక సాయం పథకాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. అర్హులైన ఆటో డ్రైవర్లకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు బత్తుల సాయి, వెలిశెట్టి ఉమాకాంత్, దొంగ లక్ష్మీ నారాయణ, దమ్మపేట మండలం అన్ని ఆటో యూనియన్ నాయకులు సంకు రమేష్, ఎస్.కె మౌలాలి, ఈసర్ల శివ, హరి, ప్రసాద్, ఎస్కే షఫీ, గాజుబోయిన శ్రీను, ఎస్కే జాకీర్, రాయల పుల్లారావు, పాండ్ర వెంకటేష్, రామకృష్ణ, ఆళ్ల నాగు, రాంబాబు, వెంకటేష్ రావు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు రూ.500 పెంపు అన్యాయం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సింగరేణిలో సుమారు దశాబ్దకాలానికి పైగా వివిధ విభాగాల్లో 30 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పలు డిపార్ట్మెంట్లలో విధులు నిర్వహిస్తున్నారని. సంస్థకు లాభాలు రావడానికి వీరి శ్రమ ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉందని, యాజమాన్యం, యావత్ కార్మికలోకం ఒప్పుకున్నా కానీ 30 వేల మంది కార్మికులను దగా చేస్తూ కార్మికులను చులకనగా చూస్తూ రూ.500 వేతనం పెంచడం అంటే , ఇంత దౌర్భాగ్యమైన పరిస్థితి మరి ఎక్కడ ఉండదని పీఎస్ డబ్ల్యూ టి యు సి ఐ కొత్తగూడెం రీజియన్ అధ్యక్షులు అమర్లపూడి శరత్ రాష్ట్ర ప్రభుత్వంపై సింగరేణి యాజమాన్యం పై మండిపడ్డారు. సోమవారం సత్తుపల్లి సమంత క్యాంప్ బెల్ట్ క్లీనింగ్ లో జరిగిన రీజియన్ కమిటీ సమావేశంలో పాల్గొన్న శరత్ మాట్లాడుతూసింగరేణిలో ఉన్న 30 వేల మంది కార్మికులు వారి కుటుంబాలను ఈనాటి కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత చులకనగా చూశారనడానికి ఇదొక నిదర్శనం అన్నారు. ఆనాటి కేసీఆర్ ప్రభుత్వాన్ని ఓడించడానికి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపించడానికి ఈ కార్మికుల ఓట్లు వేయించుకున్న రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కాకముందు అనేక వాగ్దానాలు ఇచ్చి కాంట్రాక్టు కార్మికులకు సౌకర్యాలు కల్పిస్తాం, వారికి వేతనాలు పెంచుతాం అని మాటల చెప్పిన రేవంత్ రెడ్డి ఈరోజు సింగరేణి వార్షిక లాభాల బోనస్ ప్రకటించడంలో గత సంవత్సరం 5000 ప్రకటించిన ప్రభుత్వం కనీసం ఈ సంవత్సరం పదివేలు ప్రకటించిందని అనుకున్నప్పటికీ అదనంగా రూ500/లు మాత్రమే ప్రకటించి కార్మికులను మోసం చేసిందన్నారు. ఇప్పటికైనా వెంటనే దీన్ని పునరాలోచన చేసి తక్షణమే పదివేల రూపాయలు ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జాన్, సంజీవరెడ్డి, రవి, ప్రసాద్, రమేష్, కుమార్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# మొదలైన తెలంగాణ పూల పండుగ

- ఘనంగా అటుకుల బతుకమ్మ వేడుక
- అట్టహాసంగా ఈనెల 30 వరకు సంబురాలు
- ఆడిపాడుతున్న ఆడ బిడ్డలు
- ఎటు చూసినా సుమగంధాల సువాసనలే
- వైభవంగా అమ్మవార్ల ప్రతిష్ట





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సింగిడిలో రంగులనే దూసి తెచ్చి...తెల్లచంద్రుడిలో వెన్నెలనే తీసుకొచ్చి పచ్చి తంగెడుతో గుమ్మాడి పూలు చేర్చి బంగారు బతుకమ్మను ఇంటిలో పేర్చి.. పువ్వులనే పూజించే పండుగ బతుకమ్మ. సాంస్కృతిక, సంప్రదాయ సమాహారం, ప్రకృతి సంపదకు నీరాజానం అర్పిస్తూ పితృ అమావాస్య నాడు బతుకమ్మ పండుగ సంబురాలు జిల్లా వ్యాప్తంగా మొదలయ్యాయి. చిన్నా, పెద్ద, పేద, ధనిక తేడా లేకుండా ప్రతీ ఒక్క ఆడబిడ్డ పూలతో సుందరంగా బతుకమ్మను తయారు చేసి అంతే అందంగా ముస్తాబవుతారు. తెలంగాణ జీవనాడితో విడదీయరాని అనుబంధం పెనవేసుకున్న ఈ బతుకమ్మ సంబురాలు ఈనెల 21 నుండి 30వ తేది వరకు అట్టహాసంగా పూల గంధాల గాలుల నడుమ జరగుతున్నాయి. ఇదిలా ఉండగా తొలిరోజు జిల్లా వ్యాప్తంగా ఎంగిలిపూల బతకమ్మ వేడుక వైభవంగా జరగగా సోమవారం అటుకుల బతుకమ్మ వేడుక అట్టహాసంగా సాగింది. తొమ్మిది రకాలైన పూలతో తొమ్మిది రూపాల్లో అలంకరించడం అనవాయితీగా వస్తోంది. తొలిరోజు ఎంగిలి పూల బతుకమ్మ, రెండో రోజు అటుకుల బతుకమ్మ, మూడోరోజు ముద్దపప్పు బతుకమ్మ, నాల్గోరోజు నానబియ్యం బతుకమ్మ, ఐదో రోజు అట్ల బతుకమ్మ, ఆరో రోజు అలిగిన బతుకమ్మ, ఎడవరోజు వేపకాయ బతుకమ్మ, ఎనిమిదవ రోజు వెన్నముద్దల బతుకమ్మ, తొమ్మిదవ రోజు సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది. తొమ్మిదిరోజుల పాటు అడబిడ్డలంతా ఆడిపాడుతూ రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి చక్కటి వస్త్రధారణతో ఓ వేదికను సిద్దం చేసుకుని పేర్చిన బతుకమ్మల చుట్టూ తిరుగుతూ బతుకమ్మ సంప్రదాయ పాటలు ఆలపిస్తూ నృత్యాలతో సందడి చేస్తారు.

**వైభవంగా అమ్మవార్ల ప్రతిష్ట ...**

శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ కనకదుర్గా దేవి అమ్మవార్ల ప్రతిష్ట జిల్లా వ్యాప్తంగా అత్యంత భక్తిశ్రద్దల నడుమ సాగింది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఉత్సవ పందిళ్లు వెలివగా, మరొన్ని చోట్లు ఉన్న అలయాల్లో అమ్మవార్లకు పూజాధి కార్యక్రమాలు మొదలు పెట్టారు. దేవిశరన్నవరాత్రుల విగ్రహాలను ప్రతిష్ట కోసం తీసుకొచ్చేందుకు ప్రత్యేక వాహనాలను అందంగా అలంకరించి సిద్దం చేశారు. మేళతాళాల నడుమ అమ్మవారిని ఆ వాహనాల్లో తొడ్కొని వచ్చి ప్రతిష్ట శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారు నవరాత్రుల పాటు భక్తులతో పూజలు అందుకోనుండగా ఉత్సవ పందిళ్ల వద్ద బతుకమ్మ సంబురాలు ఉత్సాహ ఉల్లాస భరిత వాతావరణంలో సాగుతున్నాయి.

# తంగేడు పువ్వు ప్రత్యేకతలు

**బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రజాపక్షం ప్రత్యేక కథనం**



**ప్రజాపక్షం/మణుగూరు:** బతుకమ్మ పండుగలో బతుకమ్మను అలంకరించడానికి తంగేడు పువ్వులను ప్రధానంగా ఉపయోగిస్తారు. ఈ పండుగలో దీనికి ప్రత్యేకమైన స్థానం ఉంది. ఇది ప్రకృతిని, జీవవైవిధ్యాన్ని సూచిస్తుంది.

**ఆయుర్వేదం...**

తంగేడు పువ్వు ఆయుర్వేదంలో కూడా చాలా ఉపయోగపడుతుంది. దీనిని డయాబెటిస్, చర్మ వ్యాధులు, మూత్రపిండాల సమస్యల చికిత్సకు వాడతారు.

**ఔషధ గుణాలు...**

ఈ పువ్వులో యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. ఇది శరీరంలోని విష పదార్థాలను తొలగించడంలో సహాయపడుతుంది.

**పర్యావరణ ప్రాముఖ్యత...**

తంగేడు మొక్క కరువును తట్టుకొని పెరుగుతుంది. ఇది నేల క్షీణతను నివారిస్తుంది. ఇది పర్యావరణ సమతుల్యతకు సహాయపడుతుంది.

**బతుకమ్మ పండుగలో తంగేడు పువ్వు...**

బతుకమ్మ పండుగ సమయంలో, తంగేడు పువ్వులు గ్రామాల్లో, పొలాల్లో, అడవుల్లో విరివిగా లభిస్తాయి. మహిళలు ఈ పువ్వులను సేకరించి వాటితో బతుకమ్మను అందంగా అలంకరిస్తారు. ఈ పువ్వులు లేకపోతే బతుకమ్మ పండుగ అసంపూర్ణంగా భావిస్తారు. తంగేడు పువ్వు కేవలం ఒక పూవు మాత్రమే కాదు, ఇది తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం, ప్రజల జీవన విధానంలో ఒక భాగం. ఇది పవిత్రత, అందం,ఆరోగ్యానికి ప్రతీక.

# ఘనంగా బతుకమ్మ సంబురాలు





**ప్రజాపక్షం/కూసుమంచి:** మండల కేంద్రంలోని గ్లోబల్ రెయిన్ స్కూల్స్, జేవీఆర్ కళాశాల బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. కోటి వెలుగులై విర పూసింది. అవని మీదికి వంగిన పూల సింగిడిగా మారింది. రంగుల రంగుల పూల హంగులై బతుకమ్మ నాట్యమాడింది. తీరొక్క పువ్వులతో కలబోత కనువిందు చేసింది. చిత్తూ చిత్తూల బొమ్మగా శివుడీ ముద్దుల బొమ్మగా బతుకమ్మ పూజలందుకుంది. పాఠశాలంతా పూలవనంగా మారింది. తీరొక్క పూలతో పూర్చిన బతుకమ్మలను ఒక చోటకు చేర్చి ఆడి పాడగా పాఠశాల మార్మోగింది. బతుకమ్మ సంబురాలు సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టాయి. సోమవారం గ్లోబల్ రెయిన్ స్కూల్స్, జేవీఆర్ కళాశాల బతుకమ్మ సంబురాలు అట్టహాసంగా జరిగాయి. గ్లోబల్ రెయిన్ స్కూల్స్, జేవీఆర్ కళాశాల కరస్పాండెంట్ మహ్మద్ ఎర్షాద్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన బతుకమ్మ సంబురాలు అట్టహాసంగా జరిగాయి. ఖమ్మం ప్రభుత్వం మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ కూరపాటి ప్రీతి, కూసుమంచి సబ్ ఇన్స్పెక్టర్ సతీమణి పూజ, ఎంఈవో రామచారి సతీమణి సుధారాణి, సైకాలజిస్టు సుష్మ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. మండల అధికారుల సతీమణులు బతుకమ్మకు పూజలు చేసి ఆడి పాడారు. బతుకమ్మలతో పాఠశాల కళకళలాడింది. పూలసింగిడిని తలపించింది. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలతో అలరించారు. తెలంగాణ సంస్కృతి ఎంత గొప్పదో చూపరులకు ప్రస్ఫూటం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అందరు దేవుళ్లను పూలతో పూజించడం మనం చూస్తాం.. కానీ మన తెలంగాణలో మాత్రం పూలనే బతుకమ్మగా పూజించడం మన సంస్కృతిలో ఉన్న విశిష్ట సంప్రదాయమన్నారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ మహ్మద్ ఎర్షాద్ అహ్మద్ మాట్లాదడుతూ ప్రకృతిని ప్రేమించి పూజించడమే బతుకమ్మ అన్నారు. ప్రపంచంలో అనేక జాతులు ఉన్నా, ప్రకృతిని ఆరాధించే ఏకైక జాతి తెలంగాణ వాసులే అన్నారు. విద్యార్థినులు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు సంసకృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఆటపాటలతో కోలాటాలు, నృత్యాలు చేసి హోరెత్తించారు. భారీ బతుకమ్మను మధ్యలో ఉంచి కోలాటాలు, నృత్యాలు చేసి సంబురంగా ఆడి పాడారు. ఉత్సాహంగా పాల్గొని ఆడిపాడి సందడి చేసి అనంతరం ఊరి చెరువులో నిమజ్జనం చేశారు. ఈకార్యక్రమంలో ఎంఈవో రామాచారి, కూసుమంచి ఎడ్యుకేషన్ సొసైటీ కరస్పాండెంట్, సెక్రటరీ పారుపల్లి రమేష్, అకడమిక్ ఇన్చార్జి మహ్మద్ ఇంతియాజ్ అహ్మద్, ఇన్చార్జులు జహ్నవి, పాపారావు, శేఖర్‌రెడ్డి, నాజియా, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆదర్శ రైతు పోటు రంగారావుకు ఘనసన్మానం






**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఇటీవల యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తమ రైతు విభాగంలో ఎన్నుకొని సన్మానించిన పోటు రంగారావును ఐటిసి టిఎన్‌టియూసి, మిత్రపక్షాలు, రైతు సోదరులు ఆధ్వర్యంలోఘనంగా సన్మాన కార్యక్రమం సోమవారం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో భద్రాచలం ఎంఎల్‌ఏ తెల్లం వెంకట్రావ్ పాల్గొని పోటు రంగారావును ఘనంగా సన్మానించారు. భద్రాచలం నందు గల కాకతీయ ఫంక్షన్ హాల్(కమ్మ సంఘం బిల్డింగ్) నందు ఐటిసి టిఎన్‌టియూసి అధ్యక్షులు కనకమేడల హరిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో కమ్మ సంఘం కమిటీ సభ్యులు హోమ్ నీడ్స్ రామారావు, వీరయ్య, చల్లగుల్ల నాగేశ్వరరావులు పాల్గొని రంగారావుని సన్మానించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ రంగారావు అటు కార్మిక నాయకుడిగా రాష్ట్ర ప్రభుత్వంచే శ్రమశక్తి అవార్డుని పొందడంతో పాటు వ్యవసాయ రంగంపై ఉన్న మక్కువతో తన వయసును పట్టించుకోకుండా వందల ఎకరాలలో జమా ఆయిల్‌ను సాగు చేస్తున్నారని కొనియాడారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఏ తాటి వెంకటేశ్వర్లు, ఐటిసి పరిశ్రమ డిప్యూటీ జనరల్ మేనేజర్ చెంగల్‌రావు, టిఎన్‌టియూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరమాచినేని రత్నాకర్, గల్లా నాగభూషయ్య, మహబూబాబాద్ తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నాయకులు కొండపల్లి రామచంద్రరావు, మాజీ బూర్గంపాడు జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత, పినపాక తెలుగుదేశం పార్టీ నాయకులు వట్టం నారాయణదొర, బూర్గంపాడు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తాళ్లూరి జగదీశ్వర్‌రావు, బిఆర్ఎస్ బూర్గంపాడు మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, భద్రాచలం సిపిఎం నాయకులు కడారి వెంకటేశ్వరరావు, భద్రాచలం టిఆర్ఎస్ నాయకులు మానే రామకృష్ణ, బిజెపి రాష్ట్ర నాయకులు ఏనుగుల వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఐటిసి పరిశ్రమ కాంట్రాక్టర్లు పాకాల దుర్గాప్రసాద్, సత్యనారాయణ, టిఎన్‌టియూసి ప్రధాన కార్యదర్శి గాదె రామకోటిరెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొని పోటు రంగారావుని సన్మానించారు.

## ప్రవీణ్ కుమార్ గౌడ్ కుటుంబానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/కరకగూడెం:** పినపాక, కరకగూడెం మండల ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యుడు ముంజాల ప్రవీణ్ కుమార్ గౌడ్ అకాల మరణం చెందగా ఆయన కుటుంబానికి సోమవారం పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ప్రతి సంవత్సరం లాగానే ఫోటోగ్రాఫర్ చనిపోయిన కుటుంబాలకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నందున వారి కుటుంబాలకు ఫోటో అండ్ వీడియోగ్రాఫర్ అసోసియేషన్ తరపున రాష్ట్ర అధ్యక్షులు హుస్సేన్, శక్తి డిజిప్రెస్ అధినేత మధుసూదన్ రెడ్డి రూ. 30 వేల చెక్కు రాష్ట్ర వాప్తంగా 6 కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులకు, జిల్లా నాయకులకు పినపాక, కరకగూడెం మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ తరపున వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మూడు మండలాలస్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభం



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** మూడు మండలాల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ని బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తహసీల్దార్ అనూష పాల్గొని రిబ్బన్ కట్ చేసి క్రికెట్ టోర్నమెంట్‌ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి శారీర ధృఢత్వానికి స్నేహ సంబంధాలను మెరుగుపరుస్తాయని అన్నారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పాయం నరసింహారావు, ప్రధాన కార్యదర్శి ఎస్‌కే బాబా, పిఏసిఎస్ ఛైర్మన్ గొగ్గేల రామయ్య, డైరెక్టర్ సాంబశివరావు, మాజీ ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి, మాజీ జెడ్‌పిటిసి కొమరం హనుమంతరావు, మైనార్టీ జిల్లా నాయకులు ఎండి ఆదాం, నియోజకవర్గ యువజన నాయకులు సయ్యద్ ఆరీఫ్, మండల నాయకులు పొదిల రాము, కొమరం వెంకటేశ్వర్లు, కొమరం నర్సింహారావు, నరెడ్ల ప్రవీణ్, పూనెం కృష్ణ, తెలగాని రాము, క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన దసరా ఉత్సవాలు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** సారపాక మేజర్ గ్రామ పంచాయితీలోని గాంధీనగర్ కనకదుర్గమ్మ ఆలయం వద్ద దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమైనవి. ఈసందర్భంగా సోమవారం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ముప్వ వెంకటేశ్వరరావు, మాజీ ఉపసర్పంచ్ పేరాల శ్రీనివాసరావులు ఈ ఉత్సవాలను ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు. ఈసందర్భంగా పేరాల శ్రీనివాసరావు మాట్లాదడుతూ మన గాంధీనగర్‌లోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద ప్రతి సంవత్సరం ఎంతో ఘనంగా భక్తిశ్రద్ధలతో దసరా ఉత్సవాలు జరిపించుకోవడం చాలా ఆనందంగా ఉందని, ప్రతి రోజు జరిగే పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. 11 రోజులు కూడా పూజలతో పాటు అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఆలయ పూజారి సాయి తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కనకదుర్గమ్మ భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పాత్రికేయుడికి పరామర్శ



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు పాత్రికేయులు మందపాటి వెంకటరెడ్డిని బూర్గంపాడు మాజీ జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత, రామకొండారెడ్డి దంపతులు సోమవారం పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా కుడి కాలు (పోలియో) తొడ వద్ద ఎముక విరిగింది. శస్త్ర చికిత్స అనంతరం సారపాకలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటుండగా ఈ విషయం తెలుసుకున్న వారు వెంకట్‌రెడ్డి నివాసానికి పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని, ధైర్యం కోల్పోవద్దని భరోసా ఇచ్చారు. అనంతరం వైద్య ఖర్చు నిమిత్తం రూ 5వేల ఆర్థిక సాయం అందజేశారు.

## కల్లూరు ఆసుపత్రిని తనిఖీ చేసిన కేంద్ర బృందం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని తెలంగాణ ప్రాంతీయ వైద్య విధాన పరిషత్ వైద్యశాలను సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి సోమవారం ఉదయం కేంద్ర బృందం సభ్యులైన సందేశ్, అభిషేక్‌లతో పాటు హరికృష్ణ లు సోమవారం ఉదయం ఆసుపత్రిలోని మౌలిక వసతులు, మందులు, వివరాలు వైద్య సౌకర్యాలు, సిబ్బంది, 50 పడకల వివరాలు ప్రజలకు అందుతున్న వైద్య వివరాలను తోపాటు రికార్డులను పరిశీలించారు. భారతీయ ప్రజా వైద్య నాణ్యతాధికారులు ఆసుపత్రి ఆవరణలో క్షుణంగా పరిసరాలను ఉదయం 10 గంటల నుంచి రెండు గంటల వరకు పూర్తిస్థాయిలో పరిశీలించారు. అనంతరం పారిశుద్ధ్య కార్యక్రమాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రమేష్, అశోక్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ రహదారుల అభివృద్ధికి తక్షణ చర్యలు తీసుకోండి

**-రహదారుల అవసరాల దృష్ట్యా ప్రాధాన్యత కల్పించండి**
**-ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ ద్వారా మంత్రి తుమ్మల వినతి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి, అనుసంధాన రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యతనివ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ ద్వారా కోరారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో కలెక్టర్లు, నేషనల్ హైవే అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో లేఖ ద్వారా ఈ అంశాలను మంత్రి తుమ్మల ప్రస్తావించారు. రహదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాధాన్యతనిస్తూ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలను లేఖలో వివరించారు. ఖమ్మం దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేకి ఖమ్మం నియోజక వర్గ పరిధిలో రెండు వైపులా సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఖమ్మం నగరానికి రెండు వైపులా సర్వీస్ రోడ్లు ఏర్పాట్లు చేయాలని కోరారు. ఖమ్మం నగరానికి రింగ్ రోడ్డు పూర్తయ్యేలా ఖమ్మం కురవి రోడ్డు నుంచి నూతన కలెక్టరేట్ (అమరావతి నాగపూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవే) వరకు ఏడు కిలో మీటర్ల రహదారిని రింగ్ రోడ్డుకు అనుసంధానంగా తక్షణం మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. జగ్గయ్యపేట కొత్తగూడెం వయా బోనకల్ వైరా తల్లాడ నేషనల్ హైవే ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ కేంద్రానికి సిఫారసు చేయాలన్నారు. ఈ రహదారులు పూర్తి చేస్తే ఖమ్మంజిల్లాలో పరిశ్రమలు, వాణిజ్య రంగం, పర్యాటక రంగాలు అభివృద్ధి చెందుతాయన్నారు. భద్రాచలం, పాల్వంచ, మణుగూరు, అశ్వాపురం వంటి పారిశ్రామిక పట్టణాలు శరవేగంగా అభివృద్ధి చెందుతాయన్నారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం భద్రాద్రి రామాలయం కొత్త శోభ సంతరించుకోనుందన్నారు. పలు ప్రముఖ పుణ్యక్షేత్రాలు అనుసంధానమవుతాయని సారపాక నుండి కాళేశ్వరం వరకు వయా అశ్వాపురం, ఏటూరి నాగారం జాతీయ రహదారిని మంజూరు చేయాలన్నారు. బూర్గంపాడు నుండి జంగారెడ్డి గూడెం వరకు వయా ముల్కలపల్లి దమ్మపేట నూతన జాతీయ రహదారిని మంజూరు చేయాలని కోరారు. రహదారుల విస్తరణ, బైపాస్ అనుసంధానం, కొత్త నేషనల్ హైవే మంజూరుపై దృష్టి సారించాలని మంత్రి లేఖలో కోరారు.

## మిషన్ భగీరథ కార్మికుల సమ్మెతో
# నిలిచిపోయిన తాగునీటి సరఫరా



**ప్రజాపక్షం/కల్లూరు:** మిషన్ భగీరథ కార్మికుల సమ్మెతో కల్లూరు డివిజన్ పరిధిలోని కల్లూరు, తల్లాడ, పెనుబల్లి, వేంసూరు ఆయా మండలాలకు సంబంధించిన మంచినీరు సరఫరా లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కార్మికులకు గత మూడు నెలల నుంచి వేతనాలు అందక అష్ట కష్టాలు పడుతున్నామని ప్రభుత్వం వారికి అందించాల్సిన వేతనాలు అందక కుటుంబాలు రోజువారీగా నిత్యవసరాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు పండుగకు వేతనాలు అందనిచో పస్తులు ఉండాల్సిందేనా అంటూ కార్మికుల వాపోతున్నారు. కల్లూరు డివిజన్ పరిధిలోని గూడూరు ప్లాంట్ వద్ద, వైరా ప్రాజెక్టు వద్ద కార్మికులు నిరసనతో విధులు బంద్ చేసి నిరసన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే రావాల్సిన బకాయిల వేతనాలను వెంటనే అందించాలని కోరుతూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమ్మెలో కల్లూరు మండలం మిషన్ భగీరథ సబ్ డివిజన్ నాయకులు అజ్మీర, లక్ష్మణ్, మేకల తిరుపతిరావు, బొబ్బన వేణు బాబు, బత్తుల కిషోర్, వాడపల్లి రమేష్, ప్రభాకర్, మనోజ్, లక్ష్మణ్, ప్రభాకర్ తదితరులు పాల్గొంటున్నారు.

# ప్రారంభమైన పూల పండుగ

**-ఎంగిలిపువ్వు బతుకమ్మతో ప్రారంభం**
**-సద్దుల బతుకమ్మతో ముగింపు**
**-ఆటపాటలతో చిన్న పెద్ద తేడా లేకుండా సందడి**







**ప్రజాపక్షం/వైరా:** జిల్లాలో ఆదివారం నుంచి పూల పండుగ ప్రారంభమైంది. ఎంగిలిపూల బతుకమ్మతో పూల జాతర ప్రారంభం. ప్రతి పల్లెతో పాటు పట్టణాల్లో పండుగ సందడి నెలకొంది. తెలుగింటి మహిళలంతా ఆనందంగా బతుకమ్మ వేడుకలను నిర్వహించుకునేందుకు రంగురంగుల బతుకమ్మలను పేర్చి బతుకమ్మ సంబరాలు జరుపుకుంటున్నారు. ఆదివారం నుంచి ఎంగిలిపూల బతుకమ్మలతో పండుగ ప్రారంభమై ఈ నెల29న సద్దుల బతుకమ్మతో బతుకమ్మ సంబరాలు ముగుస్తాయి. ప్రకృతితో మమేకమై ఆటపాటలతో ఆనందోత్సాహాల మధ్య పండుగ జరుపుకోవాలనేదే బతుకమ్మ ప్రధాన ఉద్దేశ్యం. ప్రతి సంవత్సరం ఈ పండుగ సమయానికి ప్రకృతి అంతా పూలమయంగా, పూలవనంగా మారిపోతుంది. రకరకాల పూలను సేకరించి ప్రకృతికే సమర్పించుకోవాలనే బతుకమ్మలను నీటిలో నిమజ్జనం పేరిట విడిచిపెడతారు. తెలంగాణ వాకిట్లో సిరిలొలికించే ప్రకృతి పండుగ బతుకమ్మను మహిళలు భక్తి శ్రద్ధలతో చిన్న పెద్ద అనే తేడా లేకుండా జరుపుకోవడం ఆనవాయితీ. వర్షాకాలపు చివర్లో , శీతాకాలపు తొలి రోజుల్లో వచ్చే ఈ పండుగకు వర్షాలతో జలాశయాలు కళకళలాడుతుంటాయి. రకరకాల పువ్వులు, రంగురంగులతో ఆరుబయళ్లలో వికసించి ప్రకృతికే కనువిందు చేస్తుంటాయి. ఇందులో రకరకాల పూలు, తంగేడు పూలు ఎక్కడ చూసినా విరబూసే ఉంటాయి. బంతి, చేమంతి, నందివర్ధనం లాంటి పూలకు కూడా ఇదే సీజన్. బతుకమ్మ ప్రారంభానికి కొద్దిరోజుల ముందే మట్టితీఓ తయారు చేసిన బొడ్డెమ్మలను ఆరాధిస్తారు. మహాలయ అమావ్యాస, పితృ అమావాస్యతో బతుకమ్మ వేడుకలు ఆరంభమవుతాయి. అష్టమి వరకు కొనసాగే ఈ పండుగలో కేవలం ఆచారమే కాదు! శాస్త్రీయత దాగి ఉంది. కొత్త బట్టలు ధరించి ఇత్తడి తాంబూలంలో గుమ్మడి ఆకులు పరిచి వాటి మీద తంగేడు పూలు పేరుస్తారు. కాస్త ఎత్తులో పూలను పేర్చిన తర్వాత గునుగు, బంతి, చామంతి, అడవి చామంతి, ముత్యాల పువ్వు, రుద్రాక్ష నీల గోరింట, పట్టుకుచ్చులు, కట్ల, బీరఇలాబతుకమ్మలను పేర్చడంలో రకరకాల పూలను వినియోగిస్తారు.

### బతుకమ్మ వేడుకల వివరాలు...

ఈ నెల21 తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ 22న రెండో రోజు అటుకుల బతుకమ్మ, 23న మూడో రోజు ముద్దపప్పు బతుకమ్మ, 24న నాల్గో రోజు నాన బియ్యం బతుకమ్మ, 25న ఐదో రోజు అట్ల బతుకమ్మ, 26న ఆరో రోజు అలిగిన బతుకమ్మ, 27న ఏడో రోజు వేపకాయల బతుకమ్మ, 28న 8వ రోజు వెన్నముద్ద బతుకమ్మ, 29న తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ ఇలా రోజుకో పేరుతో అమ్మవారిని కొలుస్తారు. ఆరో రోజున అలిగిన బతుకమ్మకు నివేదన ఉండదు. మిగిలిన రోజుల్లో రకరకాల ప్రసాదాలను గౌరమ్మకు నైవేద్యంగా సమర్పిస్తారు.

# కలెక్టరేట్‌లో బతుకమ్మ వేడుకలు




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** బతుకమ్మ సంబురాల్లో భాగంగా కలెక్టరేట్‌లో సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. సోమవారం బతుకమ్మ సంబురాల్లో భాగంగా రెండవ రోజు ఆటుకుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ తదితర సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి ఆడుతూ పాడుతూ తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పేవిధంగా వైభవంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళా ఉద్యోగులు బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎన్. విజయలక్ష్మి , జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, మైనార్టీ శాఖ ఆర్‌సివో అరుణ కుమారి, బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత, అధికారులు, ఉద్యోగులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# వెంకటేష్‌ను పరామర్శించిన మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లా ఫోటో గ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షులు మారగాని వెంకటేష్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పరామర్శించారు. ఆదివారం షార్ట్‌సర్క్యూట్ కారణంగా మారగాని వెంకటేష్ గృహంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం 16వ డివిజన్‌లోని అగ్నిప్రమాదం చోటు చేసుకున్న వెంకటేష్ గృహాన్ని పరిశీలించారు. అగ్నిప్రమాదానికి గల కారణాలను, ఎంత మేర నష్టం వాటిల్లింది వంటి వివరాలను తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 25లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు ఆళ్ల నిరీషా అంజిరెడ్డి, కమర్తపు మురళి, వడ్డెబోయిన నర్సంహారావు, సాధు రమేష్‌రెడ్డి, మందడపు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఉద్యోగులకు ప్రాఫిట్ బోనస్



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** తెలంగాణ రాష్ట్రానికి కొంగుబ ంగారంగా ఉండే సింగరేణి సంస్థ 2024 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సింగరేణి సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం ప్రాఫిట్ వివరాలను వెల్లడించింది. సింగరేణి సంస్థ లో వచ్చిన లాభాలలో ఉద్యోగులకు 34 % ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం. ఉద్యోగులకు సుమారుగా ఒకరికి 1.95 లక్షల రూపాయల వరకు రావచ్చు అని తెలియజేసిన సింగరేణి యాజమాన్యం. సింగరేణి సంస్థ లాభాల వాటా ప్రకటనకు హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్‌బాబు, కోల్ బెల్ట్ ప్రజా ప్రతిని ధులందరికీ, సింగరేణి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపిన సింగరేణి ఉద్యోగులు.

# టాలెంట్ స్కూల్లో బతుకమ్మ సంబరాలు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ సంబరాలను స్థానిక సత్తుపల్లి టాలెంట్ స్కూల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. పిల్లలందరూ బతుకమ్మను పేర్చి బతుకమ్మ ఆటలు ఆడడం జరిగింది. ఈ కార్యక్రమంలో టాలెంట్ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ ఫ్రీ నగరంగా ఖమ్మం

**-మాస్టర్ ప్లాన్ ప్రకారం ప్రధాన రోడ్డు విస్తరణ**
**-సిసి రోడ్డు పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ట్రాఫిక్ ఫ్రీ నగరంగా ఖమ్మం నగరాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా మాస్టర్ ప్లాన్ రూపొందించామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని 12వ డివిజన్‌లో పర్యటించి మున్సిపల్ నిధులు రూ. 49.80 లక్షలతో నిర్మించనున్న పెట్ పార్క్‌ను, రూ. 89 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు విస్తరణ, కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా ఖమ్మం నగరాన్ని అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందించడం జరిగిందన్నారు. ప్రస్తుతం చేపట్టే అభివృద్ధి పనులు పదికాలాల పాటు ఉండేలా నిర్మించాలన్నారు. నగర ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండకుండా చెత్త వేయకుండా చూడాలన్నారు. ఖాళీ స్థల యజమానులు వారి స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని లేని పక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. ఇంటిని ఎలా శుభ్రంగా ఉంచుకుంటామో కాలనీలను కూడా అదేవిధంగా శుభ్రంగా ఉంచాలన్నారు. భూ ఆక్రమణలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై ప్రార్థన మందిరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని దేవుడు ప్రజలకు ఇబ్బందులు కలిగించాలని చూడరన్నారు. ప్రజలు ఒప్పుకోవడంతో చెరువు బజార్, రైల్వేస్టేషన్ విస్తరణ చేస్తున్నామన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం ప్రధాన రోడ్ల విస్తరణ మార్కింగ్ చేయాలన్నారు. రాబోయే రోజుల్లో ఖమ్మం నగరం ట్రాఫిక్ ఫ్రీ అవుతుందని, గతంలో వేసిన బైపాస్ రోడ్డు నేడు సరిపోవడం లేదని ఖమ్మం నగరం చుట్టూ రింగ్ రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట మేరకు అందరూ సంతోషంగా, ఆహ్లాదంగా గడిపేలా ఖమ్మం నగరాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, కార్పొరేటర్ చిరుమామిళ్ల లక్ష్మి నాగేశ్వరరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మండపాలలో కొలువైన అమ్మవారు

**తొలిరోజు అంగరంగం వైభవంగా ప్రత్యేక పూజలు**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలంలోని వివిధ గ్రామాలలో దేవీ నవ రాత్రులు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రతీ గ్రామంలో దాదాపు రెండు విగ్రహాల చొప్పున మండపాలలో కొలువైయ్యాయి. విగ్రహాలను ఊరేగింపు తో ఆటా, పాటలతో సందడి తో మండపాలకు చేర్చారు. తొలి రోజు బాలా త్రిపుర సుందరి అవతారంలో దర్శనమిచ్చారు. అప్పలనరసింహాపురంలో జరిగిన కార్యక్రమంలో తోట వీరభద్రయ్య, శీలం సూర్యప్రకాష్ రావు, వెంకటనర్సయ్య, కోటేశ్వరరావు, పెద్ద వెంకటనర్సయ్య, బీ.రాంబాబు, బొమ్మకంటి ఏడుకొండలు, పర్వత రాంబాబు, చింతకాయల బిక్షం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా దేవినవరాత్రులు ప్రారంభం



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** మండలంలోని దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మర్కోడు గ్రామంలోని శ్రీకనకదుర్గమ్మ దేవాలయంలోని మండపంలోని అలంకరించిన మొదటి రోజు శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవి అమ్మవారు దర్శించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు అందుకున్నారు. మొగుదుపూరం దయాకర చారి, లక్ష్మీ ప్రసన్న దంపతులు విగ్రహ దాతలు, భవానిసేవ దీక్ష పరులు లక్ష్మీ ప్రసన్న, మాలధారణ సాయి కిరణ్, రాము అమ్మవారి చీరల దాతలు రామడుగుల నరసింహచారి, సావిత్రి దంపతులు పూజా సామాగ్రి అనుమోల వెంకటేశ్వర్లు స్వప్న దంపతులు, పురోహితుల ఖర్చు తాటికొండ గోవింద చారి సరస్వతి దంపతులు, పలు పలు విధాలుగా దంపతులు అమ్మవారి దాతలుగా ఉన్నారు. ఆలయ కమిటీ సభ్యులు నందిగామ వీరేంద్ర చారి, అనుమోల అచ్యుత్, కృష్ణ, ఈశ్వరోజుల వంశీ, ముదురుకోల్ల గణేష్, రామడుగుల కిరణ్, కొమరం లక్కీ, కొమరం వెంకటేష్, రాము, గ్రామ పెద్దలు, వ్యాపారస్తులు అమ్మవారి కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సింగరేణిలో బోనస్ సందడి

**- లాభాల్లో 34 శాతం వాటా ప్రకటించిన ప్రభుత్వం**
**- ఒక్కొక్క కార్మికుని ఖాతాకు రూ.1,95,610**
**- కాంట్రాక్ట్ కార్మికులకూ రూ.5500**
**- ముందే వచ్చిన దసరా**




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సింగరేణిలో బోనస్ సందడి నెలకొంది. 11 ఏరియాల్లోని కోల్‌బెల్ట్ కార్మిక వాడల్లో ముందే దసరా వచ్చినట్లు అయింది. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ మేరకు ప్రకటించారు. గత ఆర్థిక సం.లో సింగరేణి సంస్థ మొత్తంగా రూ.6,394 కోట్లను ఆర్జించింది. అందులో రూ.4034 కోట్లు భవిష్యత్ పెట్టుబడుల కోసం కేటాయింపు చేశారు. రూ.2360 కోట్ల నికర లాభాలు ఉన్నాయి. ఈ లాభాల్లో కార్మికులకు 34 శాతం వాటాగా రూ.819 కోట్లను 11 ఏరియాల్లో ఉన్న కోల్‌బెల్ట్ కార్మికులకు దసరా కానుకగా పంపిణీ చేయనున్నారు. దీంతో ఒక్కొక్క కార్మికుని ఖాతాకు రూ.1,95,610 జమ కానున్నాయి. అంతే కాకుండా కాంట్రాక్ట్ కార్మికులకు సైతం రూ.5500 జమ చేయనున్నారు. గత ఏడాది వారికి రూ.5000 బోనస్ ఇవ్వగా ఈ సారి అదనంగా రూ.500 పెంచి ఇస్తున్నారు.

### ముందే పండుగ...

ప్రభుత్వం సంగరేణి కార్మికులకు దసరా కానుకగా బోనస్ ప్రకటించడంతో వారి కుటుంబాల్లో దసరా పండుగ ముందే వచ్చనట్లు అయింది. తెలంగాణలో దసరా పండుగను పెద్ద ఎత్తున చేసుకునే అనవాయితీ ఉన్న నేపథ్యంలో కార్మిక వాడల్లో ఆనందం వెల్లు విరుస్తోంది. ఇదిలా ఉండగా సింగరేణి ఏరియాల్లో ఉండే పెద్ద పెద్ద షాపింగ్‌మాల్స్ కార్మికులకు ఆకట్టుకునేందుకు ఆకర్షణీయమైన ఆపర్లు ప్రకటించింది. ఇదిలా ఉండగా సోమవారం నుండి జిఎస్‌టి స్లాబులో తగ్గింపు చోటు చేసుకోగా మోటార్ సైకిళ్లు, ఎలక్ట్రానిక్ పరికరాల ధరలు తగ్గడంతో కార్మికులు పెద్ద ఎత్తున కొనుగోలు చేసే అవకాశం ఉంది.

# ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాపక్షం/పెనుబల్లి:** వియం బంజర్ జంగాల కాలనిలో విషాదం నెలకొంది. పెనుబల్లి మండలం వీ.ఎం.బంజర్ పిఎస్ పరిధిలోని జంగాల కాలనీలో ఉరి వేసుకుని అనుమానాస్పదంగా కొండపల్లి సుబ్బారావు (35) అనే యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం... మృతుడు కుల వృత్తి వన మూలికలు అమ్ముకునేందుకు దేశాటనకు వెళ్లి ఆదివారమే తిరిగి వచ్చాడని. అంతలోనే రేకులతో నిర్మించిన ఇంటిలో ఇనప రాడ్డుకి చీరతో ఉరి వేసుకొని మృతి చెంది ఉన్నాడని తెలిపారు. కుటుంబ కలహాలే ఆత్మహత్యకు గల కారణంగా స్థానికులు అనుమానిస్తున్నారు. కుమార్తె చూసి తెలపడంతో స్థానికులు వియ్యం బంజర్ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ముత్తిలింగం ఘటనస్థలికి చేరుకొని పరిశీలించి మృతదేహాన్ని పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించి విచారణ చేపట్టారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

# విద్యార్థుల హక్కుల కోసం పోరాటం

**- ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి అజిత్**
**- ఏఐఎస్‌ఎఫ్‌లో చేరిన పలువురు విద్యార్థులు**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** విద్యార్థులు తమ హక్కుల కోసం రోడ్డెక్కి పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ అన్నారు. సోమవారం చుంచుపల్లి మండల బూడిదగడ్డకు చెందిన పలువురు విద్యార్థులు అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) లో చేరారు. ఈసందర్భంగా అజిత్‌తో పాటు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య ఏఐఎస్‌ఎఫ్ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానం పేరుతో ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు కేంద్ర ప్రభుత్వం చేస్తోందని, బీజేపీ అధికారంలోనికి వచ్చిన నాటి నుండి విద్యారంగంలో అసమానతలు తీసుకురావడానికి కూలాలు, మతాల పేరుతో దేవుళ్ల పేరుతో పాఠ్యాంశాలను రూపొందించేందుకు ప్రణాళిక రచిస్తోందని విమర్శించారు. అధికారంలోని ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగాన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తోందని, ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలకు అవసరమైన మౌళిక సదుపాయాల కల్పించకుండా, ఖాళీలు భర్తీ చేయకుండా తీవ్ర జాప్యం చేస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యావ్యతిరేక విధానాలపై, ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకై ఉద్యమాలకు విద్యార్థులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించాలనే లక్ష్యంతో ఏర్పాటైన ఏఐఎస్‌ఎఫ్ స్వాతంత్ర అనంతరం కూడా విద్యారంగ సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా అనేక పోరాటుల చేసి విద్యారంగ పరిరక్షణలో కీలక పాత్రను పోషిస్తున్నట్లు తెలిపారు. విద్యారంగం తీవ్ర సంక్షోభంలో ఉన్న తరుణంలో విద్యార్థి ఉద్యమాలను మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని, పెద్ద ఎత్తున విద్యార్థి ఉద్యమాలు నిర్వహించాలన్నారు. అనేక మంది డిగ్రీలు పూర్తి చేసినప్పటికీ ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులుగా ఉన్నారని, దేశంలో, రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రతరం అవుతోందని, దీనిని అధిగమించేందుకు పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్, జిల్లా సమితి సభ్యులు రాజ్‌కమల్, నాయకులు వరుణ్, కళ్యాణ్ , మహేష్, వంశీ, సాయి తదితరులు పాల్గొన్నారు.

# పెనుబల్లి తహశీల్దార్‌గా శ్రీనివాస్ యాదవ్



**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి మండల నూతన తహశీల్దార్‌గా శ్రీనివాస్ యాదవ్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. గత తహశీల్దార్ నారాయణమూర్తి బదిలీ అవడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలం నుండి బదిలీపై పెనుబల్లి మండల తహశీల్దారుగా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ అధికారులు, సిబ్బంది తహశీల్దార్ శ్రీనివాస్ యాదవ్ కి శుభాకాంక్షలు తెలియజేశారు.

# సత్యనారాయణ మరణం బాధాకరం



**ప్రజాపక్షం/జూలూరుపాడు :** మండల పరిధిలోని కొత్తూరు గ్రామ పంచాయితీ సీనియర్ సిపిఐ నాయకులు వల్లపిన్ని సత్యనారాయణ కరెంట్ షాక్‌తో మరణించడం బాధాకరమని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్ అన్నారు. సోమవారం సత్యనారాయణ భౌతికాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పార్టీ అభివృద్ధి కి ఎంతో కృషి చేశారని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేశారని అన్నారు. పార్టీ కార్యక్రమాలలో చురుకైన పాత్ర పోషించేవాడని నిజాయితీ నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోయామని అనునిత్యం పేదల పక్షాన నిలబడే వల్లపిన్ని సత్యనారాయణ మరణం ఈ ప్రాంత వామపక్ష ఉద్యమాలకు తీరని లోటు అని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు సిపిఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. నివాళులర్పించిన వారిలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఎల్లంకి కృష్ణయ్య, సిపిఐ నాయకులు ఎల్లంకి మధు, గార్లపాటి వీరభద్రం, రోశయ్య, ఊడల సుధా, కొమ్ము రాంబాబు, వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

# మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

**ప్రజాపక్షం/చింతకాని :** ముదిగొండ మండలం గంధసిరి రేవు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను జగన్నాథపురం సమీపంలో చింతకాని పోలీసులు సోమవారం పట్టుకున్నారు. వాటిని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరేందర్ తెలిపారు.



# బతుకమ్మ పండుగ అంగరంగ వైభవంగా నిర్వహించాలి




**- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం బతుకమ్మ ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో టెలీకాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి వారసత్వానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను జిల్లా వ్యాప్తంగా అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు జిల్లాలోని అన్నిప్రాంతాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నీటి నిల్వలవద్ద జరిగే బతుకమ్మ కార్యక్రమాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆరోగ్య సిబ్బంది క్యాంపులు ఏర్పాటు చేయడంతో పాటు అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచాలన్నారు. తెలంగాణ రాష్ట్ర పండుగగా బతుకమ్మ ప్రత్యేక గుర్తింపు పొందిందని, ప్రతీ ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలాయలు విద్యాసంస్థలు, ఆస్పత్రులు, అంగన్వాడీ కేంద్రాలో బతుకమ్మ వేడుకలు తప్పని సరిగా నిర్వహించాలనిని అన్నారు. శుభ్రత, భద్రత, సాంప్రదాయం ఉట్టిపడేలా ఏర్పాట్లు పండుగ వాతావరణంలా ఉండాలని అన్ని శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# నిరుపేద గిరిజనులకు మేలు చేసేందుకే కర్మయోగి అభియాన్

**- ప్రజల భాగస్వామ్యంతో ప్రతిపాదనలు**
**- విలేకరుల సమావేశంలో ఐటిడిఏ పిఓ రాహుల్**



**ప్రజాపక్షం/భద్రాచలం :** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలు అర్హులైన నిరుపేద గిరిజన కుటుంబాలు చేరవేసేందుకే కర్మయోగి అభియాన్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని, అధికారులు, ప్రజల భాగస్వామ్యంతో ప్రతిపాదనలు తయారు చేయడం జరుగుతుందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అ్నరు. సోమవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ జోనల్ మేనేజర్ ప్రదీప్ కుమార్ సింగ్, ఇతర అధికారులతో కార్యక్రమ విజయవంతానికి తీసుకున్న కార్యచరణపైను తెలిపారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ ఐటిడిఏ పరిధిలోని 19 మండలాల్లోని మారుమూల 130 గ్రామాల్లో దర్తీ అభాజాన్, ఆదికర్మయోగి అభియాన్ పథకం మంగళవారం దుమ్ముగూడెం మండల పరిధిలోని నడికుడి గ్రామంలో లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఆదివాసీల సమస్యల పరిష్కారం రచ్చబండ మాదిరిగా గ్రామసభలు నిర్వహించి తీర్మాణాలు చేసి సమస్యల పరిష్కారానికి పనిచేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వాలకు ప్రతిపాదించిన నిధులు రాగానే అయా గ్రామాల్లో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాలు సక్రమంగా జరిగేందుకు పలువురికి శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆది కర్మయోగి అభియాన్ జిల్లా నోడర్ ధికారి, ఏపిఓ జనరల్ డేవిడ్ రాజు,డిఎంటిలు మధువన్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల ప్రిన్సిపాల్ తీరుపై చర్యలు తీసుకోవాలి



**-ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్**

**ప్రజాపక్షం/ బోనకల్ :** మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల ప్రిన్సిపాల్ తీరుపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయంలోని పరిష్కృతిలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో డిఆర్‌వోకు సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ బోనకల్ బిసి బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ సక్రమమైన మెనూ అందించకుండా ప్రభుత్వం పేరుకే మెనూ అందిస్తుందని నేను పెట్టిందే తినాలని విద్యార్థులను వేధిస్తుందన్నారు. గురుకుల పాఠశాలలో సమస్యలు విలయ తాండవం చేస్తున్న ప్రిన్సిపాల్ మాత్రం పట్టి పట్టనట్లుగా వ్యవహిస్తుందని లక్ష్మణ్ తెలిపారు. ఇటీవల బిసి గురుకులంలో ఉన్న సమస్యలు తెలుసుకునేందుకు ఏఐఎస్ఎఫ్ ప్రతినిధి బృందం బిసి గురుకులానికి వెళ్లగా ఇక్కడ మీకేంటి పని అని ప్రిన్సిపాల్ జ్యోతిర్మయితో పాటు సిబ్బంది విద్యార్థి నాయకుల పట్ల దురుసుగా వ్యవహరించారని ఇదే విషయమై జిల్లా అధికార దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ప్రిన్సిపాల్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నాగులమీరా, సంఘం నాయకులు మధు, శివ, వంశీ, సురేష్, నరేందర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/చింతకాని :** ఆరోగ్య తెలంగాణనే ప్రభుత్వ లక్ష్యమని చింతకాని మండల సీపీఐ కార్యదర్శి దూసరి గోపాలరావు అన్నారు.రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సిఫార్సు మేరకు మండలపరిధిలోని నేరడ గ్రామానికి చెందిన వంకాయలపాటి మమతకు రూ.31,500 విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును లబ్దిదారురాలికి అందజేశారు. ఈ సందర్భంగా దూసరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నిరుపేదల ఆరోగ్యానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తుందిని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మంకెన నాగేశ్వరరావు, చెవుల తిరపతిరావు, ఆలస్యం నాగేశ్వరరావు, గోవిందయ్య, సీపీఐ నాయకులు మట్టా రవి తదితరులు పాల్గొన్నారు.

# వైరాలో రియల్ వ్యాపారి మాయాజాలం

**-ఇనాం భూమిని రిజిస్ట్రేషన్ -ఫ్యాన్సీ కొట్టు వ్యాపారికి అమ్మకం**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలో కొంతమంది రియల్ వ్యాపారులు వారి స్వార్థ స్వాలంభన కోసం తప్పుడు మార్గాల్లో భూములను రిజిస్ట్రేషన్ చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు వారు కొన్న భూములను ఎకరాల్లో కొనుగోలు చేసి కుంటల్లో అమ్మకాలు చేపడుతున్నారు. గత కొద్ది రోజుల క్రితం వైరా మండలంలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ప్రభుత్వ అధికారులను కూడా బురిడీ కొట్టించాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఇనాం భూమిని కుంటల్లో ఆ రియల్ వ్యాపారి మరికరికి అమ్మి రిజిస్ట్రేషన్ చేర్పించాడు అనే ఆరోపణలు లేకపోలేదు. గ్రామ కంఠం, ఇనాం భూములను రిజిస్ట్రేషన్లు చేపించడంలో ఆ రియల్ వ్యాపారి చక్రం తిప్పుతాడు అనే ఆరోపణలు లేకపోలేదు. గజాల్లో రిజిస్ట్రేషన్, కుంటల్లో రిజిస్ట్రేషన్ అయిన అతనికి చాలా సులభై సులభం కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు లేఅవుట్ లేకుండానే రియల్ వ్యాపారం చేస్తున్నారు. ఆ రియల్ వ్యాపారి ఓ ఫ్యాన్సీ కొట్టి నిర్వాహకుడికి ప్రభుత్వ భూమిని అమ్మినట్లు సమాచారం. గ్రామకంఠం ఇనాం భూమిని వాడుకోవడానికి తప్ప అమ్మడానికి వీలు లేదు. అలాంటి భూమిని తప్పుడు మార్గంలో రిజిస్ట్రేషన్ చేపించాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులను కూడా బురిడీ కొట్టించాడనే వాదన లేకపోలేదు. ఏది ఏమైనప్పటికీ ప్రభుత్వ ఇనాం భూములను కూడా రిజిస్ట్రేషన్ చేపిస్తున్నారని ఆరోపణలు లేకపోలేదు. అధికారులు అప్రమత్తమైతే భారీ గండిపడటంతో పాటు ప్రభుత్వ భూములు కనుమరుగవుతాయని చెప్పవచ్చు.

# అడిషనల్ డిసిపిగా బాధ్యతలు స్వీకరించిన రామానుజం



**ప్రజాపక్షం/ ఖమ్మం క్రైం :** ఖమ్మం అడిషనల్ డిసిపి అడ్మిన్ బి.రామానుజం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌ను అడిషనల్ డిసిపి రామానుజం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

# జెవివి కృషి అభినందనీయం

**-సివిల్ జడ్జి కె. చంద్రశేఖర్‌రావు**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** శాస్త్రీయ భావాల వైపు ప్రజలను మరల్చాసిన అవసరం ఉందని ఇందుకు జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమని ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె. చంద్రశేఖర్‌రావు తెలిపారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ప్లీనం జిల్లా అధ్యక్షులు మోహన్ అధ్యక్షతన సోమవారం మంచికంటి మీటింగ్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన చంద్రశేఖర్‌రావుమాట్లాడుతూ మూఢ నమ్మకాలు, దూరాచారాల పట్ల ప్రజలను చైతన్యపర్చాలని ఆయన కోరారు. ప్రతి విషయానికి ఘర్షణలు పడి కేసుల దాకా వెళ్తున్నారని వారికి చైతన్య న్యాయంపై అవగాహన కల్పించాలని సూచించారు. పేదలకు న్యాయవాదులు కూడా ముందుకు రాని కేసుల్లో న్యాయ సహాయ కేంద్రాలు సహాయం చేస్తాయని తెలిపారు. సైబర్ క్రైం ఏసిపి సిహెచ్ వి ఫణీందర్ మాట్లాడుతూ మనిషికి, ఆశ, భయం అనే శక్తులు ఎప్పుడు పీడిస్తుంటాయన్నారు. ఇంటర్‌నెట్ వాడేటప్పుడు వ్యక్తిగత వివరాలను ఎప్పుడు పడితే అప్పుడు బయట వ్యక్తులకు అందించరాదన్నారు. సైబర్ నేరాలు ప్రజల అజాగ్రత్త వల్లేజరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు రాజేశ్వర్, కార్యదర్శి రాజా, బాధ్యులు కె. రామారావు, మల్లెంపాటి వీరభద్రరావు, మచ్చా సూర్యనారాయణ, లక్ష్మి నారాయణ, ఎల్‌విరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బోనకల్ క్రాస్ రోడ్డులో మౌలిక వసతులు కల్పించాలి

**ప్రజాపక్షం/ బోనకల్ :** బోనకల్ మండలంలోని బోనకల్ క్రాస్ రోడ్డులో మౌలిక వసతులు కల్పించాలని ప్రజావాణిలో సంబంధిత అధికారులకు వినతి పత్రాన్ని సోమవారం సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్ లు అందజేశారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ క్రాస్ రోడ్డులో విద్యుత్ దీపాలు, మరుగుదొడ్లు, మౌలిక వసతులు లేకపోవడంతో ప్రయాణికులకు ముఖ్యంగా మహిళలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో విద్యార్థులు, మహిళలు భయాందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే ప్రభుత్వ అధికారులు మౌలిక వసతులు కల్పించాలని ప్రజావాణిలో అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఇటికాల రామకృష్ణ, తోటపల్లి గిరి, వసంతరావు,భాస్కర్‌రావు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/వైరా:** ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్దిదారులకు వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాందాస్‌నాయక్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని, ప్రతి మండలంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడుపుతానని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని, ప్రతి పేదవాడు కట్టుకుంటున్నారని ఆయన అన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు ఆడపిల్లల తల్లిదండ్రులకు ఎంతో అండగా ఉంటాయని తెలిపారు. ఆరోగ్యంలో ప్రభుత్వం పెద్దపీఠ వేస్తుందని ఎంతోమందికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు, దాసరి దానియేలు, దొబ్బల సౌజన్య, బోళ్ళ గంగారావు, మట్టూరి వెంకటేశ్వరరావు, మచ్చా బుజ్జి, పమ్మి అశోక్, దార్న రాజశేఖర్, జవ్వాజి నాగరాజు, తేళ్ళూరి వీరయ్య, జయరాజు, నాగనబోయిన కృష్ణ, తోటకూర గోపి పాల్గొన్నారు.

# గిరిజన దర్భారు సమస్యలు పరిష్కరించాలి

**- ఐటిడిఏ పిఓ రాహుల్**



**ప్రజాపక్షం/భద్రాచలం :** గిరిజన దర్భారులో ఆదివాసీలు పెట్టుకున్న అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్ అన్నారు. సోమవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్భారుకు హాజరైన ఆయన ఐటిడిఏ పరిధిలోని ఆదివాసీ గ్రామాల నుండి తరలివచ్చిన గిరిజనుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. వాటిని పరిశీలించిన పిఓ ఆయా శాఖల అధికారులకు పరిష్కారం నిమిత్తం బట్వాడా చేశారు. అనంతరం పిఓ మాట్లాడుతూ అధికారులపై నమ్మకంతో గిరిజనులు సమస్యల పరిష్కారం కోసం వస్తుంటారని, వారి నమ్మకాన్ని ఒమ్ముచేయకుండా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. పరిష్కారానికి నోచుకోని సమస్యలపై తగిన సమయంలో సమగ్ర నివేదికలు సమర్పించాలని సూచించారు. అర్హులైన ప్రతీ ఒక్క గిరిజనులకు ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అందుతాయని, ఇందులో ఎలాంటి సందేహం అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా యూనిట్ల అధికారులు పాల్గొన్నారు.